క్లుప్తంగా

ఇంటింటా వైద్య సిబ్బంది సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కడియం: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు సోమవారం మండలంలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యులు ఎస్.జెస్సీ సుప్రియ, స్వరూప, ఎస్.నాగ సాయిమౌర్య తెలిపారు. మండలంలో ఐదేళ్ల లోపు వయసున్న 5,582 మంది పిల్లలకు గాను, మొదటిరోజు ఆదివారం బూత్‌లలో 5,447 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. సోమవారం ఒక మొబైల్ టీం, ఒక ట్రాన్సిట్ టీం, 72 బృందాలు కలిసి 10,344 గృహాలను సందర్శించి 79 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారని తెలిపారు. దీంతో మొత్తం 5,526 మంది పిల్లలకు (98.99%) పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన 7,013 గృహాలను మూడో రోజు మంగళవారం సందర్శించి నూరుశాతం పోలియో చుక్కలు అందిస్తారన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: కడియపులంకలోని ఫెలోషిప్ సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ ఆధ్వర్యంలో బైబిలు మిషన్ రారాజు మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. అధ్యక్షుడు ఎం.కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి, ఉపాధ్యక్షుడు ప్రసన్న కుమార్, గౌరవాధ్యక్షుడు కె.జయశీల్‌లు శుభాలు అందజేశారు. జీవరత్నం అధ్యక్షత వహించగా రాజుజోషియా వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో డి.రత్నరాజు, సాలోమోను, రాకడరావు, విక్టర్ పాల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల సీజ్



వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ తులసీధర్

కడియం: ట్రాఫిక్ నిబంధనలను అతి క్రమించి వాహనాలు నడిపితే, సదరు వాహనాలను సీజ్ చేస్తామని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ హెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం వేమగిరి హైవే జంక్షన్‌లో ఎస్‌ఐ కృష్ణసాయి, సిబ్బందితో కలిసి ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ రైడింగ్ చేస్తున్న వారిని పట్టుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు. పలువురికి జరిమానాలు విధించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే మైనర్లు, వారి తల్లిదండ్రులపై కూడా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

యూటీఎఫ్ సమావేశం

కంబాలచెరువు: పాత పెన్షన్ విధానం ఓపీఎస్‌ను అమలు చేస్తామని హామీ ఇచ్చిన వారికే వచ్చే ఎన్నికల్లో ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక యూటీఎఫ్ హోంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడారు.

కాకినాడ వెళ్లి పింఛన్ పంపిణీ



సుబ్రహ్మణ్యానికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ విజయదుర్గ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ సచివాలయం–3 పరిధిలోని అద్దేపల్లి సుబ్రహ్మణ్యం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ విజయదుర్గ సోమవారం కాకినాడ వెళ్లి అతడికి వృద్ధాప్య పింఛన్ అందించింది.

స్పందనకు 41 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నగర పాలన సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 41 అర్జీలు వచ్చినట్టు కమిషనర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఆస్తి పన్ను పెండింగ్ బకాయిలు వసూలు చేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఇంటి పన్ను కోసం వచ్చే అర్జీలను స్వీకరించి, త్వరితగతిన డిమాండ్ జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



17వ డివిజన్ ఐఓసీఎల్ వాంబేకాలనీలో సీసీ ఫ్లోరింగ్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు, చిత్రంలో చందన నాగేశ్వర్ తదితరులు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- రూ.4.21 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని నగరపాలకసంస్థ పరిధి డివిజన్లలో రూ.4.21 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ డివిజన్లలో ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేయగా, ఇంజినీరింగ్ అధికారులు పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి, ప్రారంభానికి శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. మంత్రిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా, తన ముందు కో ఆర్డినేటర్‌గా పనిచేసిన చందన నాగేశ్వర్, స్థానిక నాయకులు, అధికారుల సహకారంతో రూరల్ పరిధిలో అర్బన్ ప్రాంతంలో ఉన్న ఎనిమిదిన్నర డివిజన్లలో పార్కుల అభివృద్ధి, డ్రైనేజీలు, అంతర్గత రహదారుల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, డివిజన్ల ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు చీకురుమల్లి చిన్న, దమ్ము ప్రసాద్, నాగిరెడ్డి, నెల్లి సర్వేశ్వరరావు, దుంపా చంద్రారెడ్డి, చిడిపి బ్రహ్మానందరెడ్డి (మమతారెడ్డి), చాపా రాజా, రాంకీ, పడమటి కామరాజు, ప్రకాష్‌బాబు, మాజీ కార్పొరేటర్లు ఏవీ రమణ, నేతల రామచంద్రరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు

- 17వ డివిజన్ ఐఓసీఎల్ వాంబే కాలనీలో రూ.19 లక్షలతో సీసీ ఫ్లోరింగ్ పనులు, రూ.21 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు, రూ.20 లక్షలతో శంభూనగర్‌లో సీసీ డ్రైనేజీ నిర్మాణం, రూ.19 లక్షలతో అంబికా నగర్ పార్కు అభివృద్ధి, రూ.10 లక్షలతో ఎస్‌కే ఎన్‌క్లేవ్ ఎదురుగా పార్కు అభివృద్ధి, రూ.20 లక్షలతో బొగ్గుల దిబ్బ పార్కు అభివృద్ధి పనులు
- 18వ డివిజన్‌లో రూ.10 లక్షలతో రైల్వేస్టేషన్ రోడ్డులోని మెయిన్ డ్రైనేజీ శ్లాబ్ పనులు.
- 20వ డివిజన్‌లో రూ.16 లక్షలతో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫ్రీడమ్ ఫైటర్స్ పార్క్ వరకూ సీసీ డ్రైనేజీ పనులు.
- 21వ డివిజన్‌లో శ్యామలా థియేటర్ వెనుక పెద్దాడ వారి వీధిలో సీసీ డ్రైనేజీ నిర్మాణం.
- 26వ డివిజన్‌లోని స్టేడియం రోడ్డులో రూ.9.90 లక్షలతో ఎంఎస్ గ్రిల్ సాల్ప్, ఇతర సీసీ డ్రైనేజీ మరమ్మతులు.
- 27వ డివిజన్ కృష్ణారావుపేటలోని రూ.8.45 లక్షలతో అంతర్గత రహదారుల నిర్మాణం.
- 28వ డివిజన్‌లో రూ.9.70 లక్షలతో శారద ఐస్ ఫ్యాక్టరీ రహదారి అభివృద్ధి, మరమ్మత్తులు, రూ.8.80 లక్షలతో కుమ్మరి వీధి రామాలయం నుంచి కడియంచర్ల వారి వీధి వరకూ సీసీ డ్రైనేజీల నిర్మాణం.
- 16వ డివిజన్‌లో రూ.50 లక్షలతో ఆదర్శ నగర్ నుంచి 13, 17, 19, 23, 24 రహదారుల అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారి నిర్మాణ పనులు.

ముస్లింల అభ్యున్నతికి కృషి



షాదీఖానా శంకుస్థాపన కార్యక్రమంలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, జకియా ఖానమ్ తదితరులు

- ఎంపీ భరత్‌రామ్
- షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముస్లింల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్టు ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 16వ డివిజన్ ఆవరోడ్డులోని పాత మేకల కబేళా స్థలంలో ముస్లిం మైనారిటీల షాదీ ఖానాకు 1500 గజాల స్థలాన్ని కేటాయించి, షాదీ ఖానా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ మయాన జకియా ఖానమ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజం, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

జగనన్న అడుగుజాడల్లో..

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ జగన్ సర్కార్ ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జగనన్న అడుగు జాడల్లో నడుస్తున్న తాను కూడా నగరంలోని ముస్లింలకు అండగా ఉంటున్నానన్నారు. నగరంలో టీడీపీ నాయకులు ఈ షాదీ ఖానా శంకుస్థాపనను అడ్డుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారన్నారు. టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు తన మనుషులను పంపి రాద్ధాంతం చేయడం చూస్తుంటే, ముస్లింలపై వారు ఏ విధంగా కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారో అర్థమవుతుందన్నారు. షాదీ ఖానా నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు ప్రకటించగానే, సభలో పాల్గొన్న రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు సహా ముస్లిం సంఘ పెద్దలు భారీగా విరాళాలు ప్రకటించారు.

భరత్‌రామ్‌ను గెలిపించాలి

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజం మాట్లాడుతూ నగరంలోని ముస్లిం సోదరులందరూ ఏకాభిప్రాయంతో మార్గాని భరత్‌రామ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ మయాన జకియా ఖానమ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరిఫ్, హజ్ కమిటీ డైరెక్టర్ ఇబాదుల్లా ఖురేషి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజాం, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ వజీరుద్దీన్, సీనియర్ మైనార్టీ నాయకులు డాక్టర్ బేగ్, మటన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కరీముల్లా, అల్ సమీ గ్రూప్ అధినేత సలామి, వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ అధ్యక్షుడు కరీం ఖాన్, మైనార్టీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ అబ్దుల్ బషీరుద్దీన్, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ భరత్‌రామ్
- విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడం విద్యతోనే సాధ్యమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని చందా సత్రంలో సోమవారం జరిగిన ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలోని ధార్మిక సంస్థ చందా సత్రం ఏటా నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యలో ప్రతిభ చూపే పేద విద్యార్థులకు రూ.1500 ఉపకార వేతనం అందజేస్తోంది. దీనిలో భాగంగా ఈ సంవత్సరం 200 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసింది. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ గతేడాది ఉపకార వేతనాలుగా రూ.లక్ష అందజేస్తే, ఈ సంవత్సరం రూ.3 లక్షలు అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చందా సత్రం చైర్మన్ రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇందు కోసం దగ్గరలో పోస్టాఫీసులో రిజిస్టర్ చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తుందన్నారు. దీని కోసం 150 యూనిట్లు విద్యుత్ వినియోగానికి ఒక కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దానికి రూ.55 వేల నుంచి రూ.65 వేల వరకు వ్యయం అవుతుందని, ఒక కిలో వాట్స్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల వరకు రాయితీ కల్పిస్తుందన్నారు. సొంతిల్లు ఉన్నవారందరూ ఈ పథకానికి అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని, వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ నిమిత్తం మీ మొబైల్ నెంబరు, గత నెల విద్యుత్ బిల్లును ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మొదటి విడతలో భాగంగా రిజిస్టర్ చేసుకున్న మొదటి కోటి మందికి సబ్సిడీ కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 85005 90045, 94930 95398 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా ప్రసారాలను తిలకిస్తున్న జిల్లా ఉపవిద్యాధికారి నారాయణ. చిత్రంలో ఉపాధ్యాయులు

కడియం: ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి నారాయణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన, 8, 9 తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉపయోగిస్తున్న ట్యాబ్‌లు, ఐఎఫ్‌బీ ప్యానల్స్, పాల్‌ల్యాబ్ పని గంటలు, రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ 15వ ఎపిసోడ్‌ను ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఆరో తరగతి విద్యార్థులను టోఫెల్ నిమిత్తం దత్తత చేసుకున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ ఆయనకు ఆయా వివరాలను తెలియజేశారు. మండల విద్యాశాఖాధికారి మణికుమార్, స్కిల్ టీచర్ ఎ. పవిత్ర వారి వెంట ఉన్నారు.

ఈఎండీపీతో విద్యార్థులకు వ్యాపార దక్షత

- డీఎస్ఈవో వాసుదేవరావు
- డైట్‌లో జిల్లాస్థాయి ఎక్స్‌పో



రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల విజేతలతో డీఎస్ఈవో వాసుదేవరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థి దశలోనే ఉత్తమ వ్యాపార దక్షత అలవడేందుకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపి) ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో సోమవారం ఈఎండీపీ జిల్లాస్థాయి ఎక్స్‌పో 2023 – 24 పోటీలు నిర్వహించారు. ఉప విద్యాశాఖ అధికారి ఈవీబీఎన్ నారాయణ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఆర్థిక అవసరాలను తీర్చే ప్రయత్నం చేయాలన్నారు. ఈ పోటీల్లో కాటకోటేశ్వరం ఉన్నత పాఠశాల మొదటి, గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. ఈ రెండు ప్రాజెక్టులు ఈ నెల ఆరున జరిగే రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోకు వెళతాయి. జిల్లాలోని వివిధ హైస్కూళ్ల నుంచి 98 ప్రాజెక్టులు సమర్పించగా, వాటిలో 11 ప్రాజెక్టులకు ఈ జిల్లా ఎక్స్‌పోలో ప్రదర్శించారు. జిల్లా స్థాయి నుంచి వచ్చిన ప్రాజెక్టులు పరిశీలన చేసి, వాటిలో రెండింటిని జిల్లా సైన్స్‌ఎంఅధికారి నెహ్రూ ఎంపిక చేశారు. ఆయనతో పాటు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సూర్యానారాయణ, ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం వెంకటరమణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ పోటీలకు 11 స్కూళ్ల నుంచి 55 మంది విద్యార్థులు, 12 మంది గైడ్ టీచర్లు తరలివచ్చారు.

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్‌వో ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. రూ.3 లక్షల విలువైన ఈ రివర్స్ ఆస్మాసిస్ ప్లాంట్‌ను ఇంటబెక్స్ టొబాకో కంపెనీ జనరల్ మేనేజర్ పుప్పాల వెంకట రమణారావు జ్ఞాపకార్థం ఆయన భార్య రమాదేవి అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి తెలిపారు. విద్యార్థినుల కోసం ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభించడం సంతోషమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

ధవళేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో సోమవారం జరిగిన డ్రీమ్స్ క్రీడోత్సవ్–2024 బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ప్రాముఖ్యతను ఇస్తున్న డ్రీమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. అనంతరం డ్రీమ్స్ క్రీడోత్సవ్–2024లో క్రికెట్, రన్నింగ్, త్రోబాల్, కబడ్డీ తదితర క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాళ్లు వి.సంధ్యాకుమారి, జి.విమలా రోజి, ఎస్.దీపిక, కె.లలితాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేత మనసులకు ఏ కష్టమొచ్చిందో..

- బాలిక, బాలుడి బలవన్మరణం
- హుకుంపేట, మోరంపూడి ప్రాంతాల్లో విషాదఛాయలు

రాజమహేంద్రవరం రూరల్: తొమ్మిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక, ఇంటర్ ఫెయిలైన 17 ఏళ్ల బాలుడు ప్రేమించుకుని ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయారు. ఇద్దరూ ఎక్కడో ఒక చోట ఉంటారులే వారే తిరిగి వస్తారనుకున్న ఇద్దరి తల్లిదండ్రులకూ చివరకు కడుపుశోకాన్ని మిగిల్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ కటికి రహదారి కరకవలస కొండల్లో చెట్టుకు వీరిద్దరూ చున్నీతో ఉరివేసుకుని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటనతో హుకుంపేట, మోరంపూడి ప్రాంతాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. మోరంపూడి ప్రాంతానికి కొత్తల జ్యోత్స్న (14) హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆ విద్యార్థిని తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, ఎర్రబాబు మనస్పర్థలతో విడిపోయారు. దీంతో వెంకటలక్ష్మి తన ఇద్దరు కుమార్తెలతో సోదరుడు సన్యాసి నాయుడు సంరక్షణలో ఉంటోంది. హుకుంపేట ఎస్సీపేట ప్రాంతానికి చెందిన గూడ్స్ ఆటోడ్రైవర్ చప్పా శ్రీను, నాగమణి దంపతుల కుమారుడు చప్పా చైతన్య(17) ఇంటర్ చదివాడు. ఇంటర్‌లో ఒక సబ్జెక్ట్ ఉండిపోవడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఈ విషయం తెలిసిన చైతన్య తల్లిదండ్రులు అతడిని విశాఖపట్నంలోని బంధువుల ఇంటికి పంపించేశారు. ఇటీవల తల్లిదండ్రులను చూద్దామన్న వంకతో చైతన్య హుకుంపేట వచ్చాడు. గత నెల 27వ తేదీ సాయంత్రం జ్యోత్స్నతో కలిసి విశాఖపట్నం వెళ్లిపోయాడు. అనంతరం ఇద్దరూ అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వెళ్లి అనంతగిరి మండలం బొర్రా పంచాయతీ కటికిరహదారి కరకవలస కొండల్లో చెట్టుకు ఇద్దరు చున్నీతో ఉరివేసుకుని ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డారు. అక్కడ పశువుల కాపరులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనతో హుకుంపేట, మోరంపూడి ప్రాంతాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రేమను గెలిపించుకోలేమనే..

ప్రేమలో పడిన తాము తల్లిదండ్రులను ఒప్పించి గెలవ లేమనే అభద్రతా భావంతోనే వీరు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని కటుంబ సభ్యులు భావిస్తున్నారు. జ్యోత్స్న చదువులో అందరికంటే ముందుండేదని, అటువంటి అమ్మాయి ఇలా బలవన్మరణం చెందడాన్ని తోటి స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు నమ్మలేకపోతున్నారు. గత నెల 27న ఇంగ్లిషు పరీక్ష రాసిందని, ఆ తర్వాత నుంచి పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇదే విషయంపై జ్యోత్స్న తల్లి వెంకటలక్ష్మి గత నెల 27వతేదీ రాత్రి బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే చైతన్య చాలా నెమ్మదస్తుడని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



ముస్లిం మహిళలకు సరుకులు పంపిణీ చేస్తున్న సుభాన్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ, నామవరం గ్రామాల్లోని 80 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం నిత్యావసర సరుకులు (రంజాన్ తోఫా) పంపిణీ చేశారు. నూర్ బాషా ముస్లిం సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని 15 గ్రామాలలో ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని షేక్ సుభాన్ తెలిపారు. కార్యక్రమంలో జేబిహెచ్ పెద్దలు ముస్తఫా షరీఫ్, ముజిబుర్ రెహ్మాన్, నజీర్, ఖాదర్ ఖాన్, మునీరా సిస్టర్స్ పాల్గొన్నారు.

పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి సర్వం సిద్ధం

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వంగలపూడి రేవు నుంచి ఏలూరు (గతంలో పశ్చిమ గోదావరి) జిల్లాలోని పట్టిసీమ వీరభద్రుడి దర్శనానికి వెళ్లే భక్తులకు ఈ ఏడాది నడక మార్గమే ఆధారం. వంగలపూడి రేవు నుంచి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, పలు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాలు జారీ చేశారు. రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయ ఉంది. దానిపై పంచాయతీ ఆధ్వర్యంలో నడక మార్గం (వారధి) ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 8న మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి తరలివెళ్లే భక్తులకు గోదావరి పాయపై వేసిన వారధి మార్గం ఎంతో ఉపయోగపడుతుంది. వంగలపూడి రేవు నుంచి కిలోమీటరు దూరంలోని గోదావరి పాయ దాటిన తరువాత అక్కడ నుంచి సుమారుగా మూడున్నర కిలోమీటర్లు ఇసుకలో నడిచి పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి చేరుకోవచ్చు. వంగలపూడి పంచాయతీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించగా సైకిల్ స్టాండ్‌ను రూ.65 వేలకు చిడిపి బాలకృష్ణ, ట్రాక్టర్లపై తరలింపును రూ.65 వేలకు ఇనుగంటివారిపేటకు చెందిన గుల్లి దామోదరం పాడుకున్నారు. రేవు నుంచి ఇసుక మార్గంపై వెళ్లడానికి, అనంతరం ఆలయం వరకు ట్రాక్టర్‌పై వెళ్లడానికి నగదు చెల్లించాలి.

రామచంద్రపురంలో..

పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం వద్ద గోదావరి పాయ నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం వరకూ నడిచి వెళ్లడానికి అనువుగా ఉంది. పురుషోత్తపట్నం వద్ద గోదావరి పాయ నిలిచిపోయింది. దీని వలన ఇసుక తిప్పలు ఏర్పడ్డాయి.

సత్య గోవింద్ సేవలు అభినందనీయం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లా పశుసంవర్థకశాఖ అధికారిగా డాక్టర్ ఎస్‌జీటీ సత్య గోవింద్ సేవలు అభినందనీయమని కలెక్టర్ మాధవీలత అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల సూపర్ స్పెషాలిటీ పశువుల ఆస్పత్రికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళుతున్న ఆయనకు సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఉత్తర్వులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త జిల్లాలో సత్య గోవింద్ సమర్థవంతంగా సేవలు అందించారన్నారు. జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కేంద్రాలు, బల్క్ మిల్క్ యూనిట్లు ఏర్పాటు చేయడంలో ఆయన కృషి అభినందనీయమన్నారు. డీఆర్‌ఓ జి.నరసింహులు, పర్యాటక శాఖ ఆర్డీ వి.స్వామినాయుడు, వివిధ శాఖలు పాల్గొన్నారు.

18 కేజీల గంజాయి పట్టివేత



నిందితులు, గంజాయితో రెండో పట్టణ పోలీసులు

కంబాలచెరువు: చెన్నైకి తరలిస్తున్న 18 కేజీల గంజాయిని రెండో పట్టణ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో వైజాగ్ సమీపంలోని నక్కపల్లి ఏజెన్సీ ప్రాంతం నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్న నిందితులు బస్సులో రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆ ప్రాంతంలో దాడి చేశారు. చెన్నైలోని తేని జిల్లా ఉత్తమపాలయానికి చెందిన వనరాజ్, వచ్చుతెవర్ ఎలనదిరం అనే ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 18 గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రాజమహేంద్రవరం 5వ ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో రిమాండ్ రిపోర్టుతో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాలతో నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.